క్లుప్తంగా

కార్యకర్తలకు అండగా ఉంటా

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సాయం అందజేసిన ఎమ్మెల్యే

కడ్తాల్: కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడి పనిచేసే కార్యకర్తలకు ఏ ఆపద వచ్చినా అండగా ఉంటానని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మండల పరిధి కర్కల్‌పహాడ్ గ్రామానికి చెందిన కార్యకర్త సిలివేరు శ్రీను అనారోగ్యంతో గత నెలలో మృతి చెందాడు. ఈ మేరకు సోమవారం నగరంలోని తన నివాసంలో ఎమ్మెల్యే.. బాధిత కుటుంబానికి రూ.2 లక్షల ఆర్థిక సహాయం అందజేశారు. బాధితుడి పిల్లలు ఉన్నత చదువులు చదివేందుకు సహకారం అందిస్తానని తెలిపారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



ఇబ్రహీంపట్నంలో నిరుపేదలకు సరుకులు పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

ఇబ్రహీంపట్నం/మంచాల: బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, ఎంకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్‌రెడ్డి జన్మదినోత్సవ వేడుకలను సోమవారం ఆ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నంలో నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరుకులు, మంచాలలో గ్రామ పంచాయతీ సిబ్బందికి బియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సర్కారు బడికి నీరందించాలి



ఎంపీడీఓకు సమస్య వివరిస్తున్న నాయకులు

మంచాల: మండల పరిధి ఆరుట్ల గ్రామం ప్రభుత్వ పాఠశాలలకు తాగునీటిని సక్రమంగా సరఫరా చేయాలని మాదిగ జేఏసీ నియోజకవర్గ అధ్యక్షుడు కంభాలపల్లి భాస్కర్ కోరారు. సోమవారం ఎంపీడీఓ బాలశంకర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పేద విద్యార్థులు విద్యనభ్యసించే పాఠశాలకు తాగు నీటి సరఫరా సక్రమంగా లేకపోవడంతో పిల్లలు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. మిషన్ భగీరథ నీటి సరఫరా లేకపోతే.. స్కీం బోర్ల ద్వారా నీటి వసతి కల్పించాలని డిమాండ్ చేశారు. దీనికి స్పందించిన ఎంపీడీఓ మాట్లాడుతూ.. తాగు నీటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పావని, ఎంపీఓ ఉమారాణి, పేరెంట్స్ కమిటీ సభ్యులు అబ్దుల్ ఆజాద్, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రుడి కల్యాణం



ఉత్సవంలో భక్తులు

కడ్తాల్: మండల కేంద్రంలోని శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో విశ్వకర్మ చేతి వృత్తుల సేవా సంఘం ఆధ్వర్యంలో సోమవారం వీరబ్రహ్మేంద్రస్వామి- గోవిందామాంబల కల్యాణం ఘనంగా జరిపించారు. ఈ సందర్భంగా డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్ గుప్తా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. సంఘం అధ్యక్షుడు లక్ష్మణచారి, బీఆర్ఎస్ మండల మహిళా అధ్యక్షురాలు వాణిశ్రీ, నాయకులు శ్రీను, యాదయ్యాచారి, లింగయ్యాచారి, బ్రహ్మయ్య, శివలింగం, మహేశ్, రమేశ్, రామకృష్ణ, నాగరాజు, గణేశ్, అంజి ఉన్నారు.

శ్రీరామనవమి ఉత్సవ కమిటీ ఎన్నిక

కందుకూరు: మండల పరిధిలోని కొత్తగూడలో నూతనంగా శ్రీరామనవమి ఉత్సవ కమిటీని గ్రామస్తుల సమక్షంలో సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా బొక్క బాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బొక్క సుధాకర్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా సొడప్ప శేఖర్‌గౌడ్, సామ ప్రకాశ్‌రెడ్డి, కార్యదర్శులుగా తల్లోజు చంద్రశేఖరాచారి, కోశాధికారిగా పుల్లగూరల తిరుపతిరెడ్డి, సలహాదారులుగా రాయిచెట్టు యాదయ్య, బొక్క లోకేశ్వర్‌రెడ్డి, బొక్క నరేందర్‌రెడ్డి, బొక్క సత్యనారాయణరెడ్డి, కుమ్మరి లక్ష్మయ్య, పిట్టల యాదయ్య, బొక్క హన్మంత్ రెడ్డిలను ఎన్నుకున్నామన్నారు.

రోడ్డు ధ్వంసం.. ప్రయాణం నరకం

ఈ రహదారి పొడవునా గోతులు ఏర్పడి.. వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకంగా మారింది. పట్టుమని కిలో మీటర్ మేర సాఫీగా సాగని ప్రయాణంతో చోదకులు ఇబ్బంది పడుతున్నారు. గుంతల రోడ్డులో ప్రయాణం ఎలా అని వాపోతున్నారు. కాగా.. అధ్వాన రోడ్డు ఆధునికీకరణకు శంకుస్థాపన చేసినప్పటికీ.. శిలాఫలకానికే పరిమితమయింది.

- అధ్వానంగా ఆమనగల్లు- చారకొండ రోడ్డు
- గుంతల దారితో వాహనదారుల అవస్థలు
- మరమ్మతులు మరిచిన అధికార యంత్రాంగం



ఆమనగల్లు- చారకొండ రోడ్డు దుస్థితి

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణం నుంచి చారకొండ వరకు సుమారు 10 కిలో మీటర్ల రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. రోడ్డ పొడవునా గోతులు ఏర్పడి వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. కొన్నేళ్లుగా సమస్య వేధిస్తున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదని పరిసర ప్రాంత ప్రజలు, ప్రయాణికులు ఆరోపిస్తున్నారు.

రెండు జిల్లాలకు అనుసంధానం

రంగారెడ్డి జిల్లా హైదరాబాద్- శ్రీశైలం జాతీయ రహదారిలోని ఆమనగల్లు పట్టణం నుంచి జడ్చర్ల- కోదాడ జాతీయ రహదారికి అనుసంధానంగా నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ వరకు డబుల్‌రోడ్డు ఉంది. ఆమనగల్లు నుంచి చారకొండకు ఉన్న రోడ్డు.. రెండు జిల్లాలతో పాటు రెండు జాతీయ రహదారులను కలిపి ఉంది. అలాంటి రోడ్డు ప్రస్తుతం అధ్వానంగా తలపిస్తోంది. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధి జంగారెడ్డిపల్లి నుంచి మాడ్గుల మండలం చంద్రాయణపల్లి వరకు దాదాపు సుమారు 10 కిలో మీటర్ల రోడ్డు ఉంది. గతంలో ఆమనగల్లు నుంచి చారకొండ వరకు డబుల్‌రోడ్డు నిర్మించినప్పటికీ.. జంగారెడ్డిపల్లి నుంచి చంద్రాయణపల్లి వరకు రోడ్డు నిర్మించలేదు.


2023లో శంకుస్థాపన

ఆమనగల్లు నుంచి చారకొండ రోడ్డు ఆధునీకరణకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2023లో రూ.2.12 కోట్లు మంజూరు చేసింది. అదే ఏడాది ఆగస్టు 29న నిర్మాణ పనులకు నాటి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ శంకుస్థాపన చేశారు. అనంతరం ఎన్నికల కోడ్, రోడ్డు పనులకు టెండర్లు వేసినా ఎవరూ రాకపోవడంతో పనులు ముందుకు సాగలేదు. దీంతో ఆధునీకరణ పనులు శిలాఫలకానికే పరిమితమయింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు మరమ్మతుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ఆధునికీకరణకు వేసిన శిలాఫలకం

రేపటి నుంచి వార్షికోత్సవాలు



ఆలయంలో కొలువైన సీతారామచంద్ర స్వామి

కడ్తాల్: మండల కేంద్రంలోని శ్రీ సీతారామాలయంలో శ్రీ విజయగణపతి, శ్రీ జ్ఞాన సరస్వతి, శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 9 నుంచి 11 వరకు జరగనున్నాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు. బ్రహ్మోత్సవాలను, శ్రీశైలం శ్రీ చంద్రశేఖర శివాచార్య మహాస్వామి శిష్య బృందంతో పాటు, అంగడి మఠం భువనేశ్వర్ స్వామి, జ్ఞానేశ్వర శాస్త్రి, హరీశ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు సరస్వతి సీతారామ ఆలయ నిర్మాణ దాత పి.బస్వారాజ్ రాజమణి పేర్కొన్నారు.

కార్యక్రమాల వివరాలు

9న సుప్రభాతం, నిత్యార్చనలు, అభిషేకాలు, గోపూజ, ఆలయ ప్రవేశం, మహాగణపతి విశ్వక్సేన ఆరాధన, గౌరిపూజ, పుణ్యాహవాచనం, నాందీ, పంచగవ్య ప్రాశన, ఋత్విగ్వరణం రక్షబంధనం, అఖండ దీపారాధన, మహామంగళ హారతి, మంత్ర పుష్పం, తీర్థ ప్రసాద వితరణ. 10న సుప్రభాత సేవలు, నిత్య అర్చనలు, ధ్వజారోహణం, మంటప దేవా స్థాపనలు, అభిషేకం మంత్ర పుష్పం తీర్థ ప్రసాద వితరణ, కుంకుమార్చనలు, హోమం. 11న ఉదయం 11.35 గంటలకు శ్రీ సీతారామ స్వామి కల్యాణ లీలా వైభవం, అనంతరం మహా బలిహరణ, కుంభాభిషేకం, పూర్ణాహుతితో ఉత్సవాలు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు ముమ్మరం చేశామని పేర్కొన్నారు.

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం



ఆలయ కమిటీ సభ్యులకు చెక్కు అందజేస్తున్న దాత బచ్చిరెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకంగా పనిచేస్తాయని నాగోల్ ఇన్‌స్పెక్టర్ సూర్యానాయక్ అన్నారు. పెద్ద అంబర్‌పేట్ మున్సిపల్ పరిధి గౌరెల్లి గ్రామంలో కొలువైన స్వయంభూ స్వర్ణగిరి లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో సోమవారం ఆయన సీసీ కెమెరాలను ప్రారంభించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ.. దేవాలయ భద్రతకు, భక్తుల సౌకర్యార్థం నిఘా నేత్రాలు ఉపయోగపడతాయన్నారు. ప్రతి ఒక్కరూ కెమెరాల వినియోగంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. అనంతరం ఆలయ శాశ్వత అలంకరణ పనులకు దాత బచ్చిరెడ్డి రూ.ఐదు లక్షల చెక్కును ఆలయ కమిటీ నిర్వాహకులకు అందజేశారు. అంతకు ముందు ప్రాంగణంలో గుండం నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో అర్చకుడు నవీన్ కుమార్, ఎస్‌ఐలు శివనాగ ప్రసాద్, రమేశ్, ఆలయ కమిటీ చైర్మన్ నెల్లూరి రాజు, వైస్ చైర్మన్ చెంచల శ్రీనివాస్, డైరెక్టర్లు దివ్యదాసు, రాజు, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



బీజేపీ జెండాను ఆవిష్కరిస్తున్న కమలనాథులు

- బీజేపీ నాయకులు

ఆమనగల్లు: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి పార్టీ శ్రేణులు గడపగడపకు వెళ్లి, ప్రజలకు వివరించాలని ఆ పార్టీ రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యుడు కండె హరిప్రసాద్ సూచించారు. పట్టణంలోని 15వ వార్డులో సోమవారం పార్టీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కాషాయం జెండాను పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు కర్నాటి విక్రంరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హరిప్రసాద్ మాట్లాడుతూ.. మోదీ ఆధ్వర్యంలో దేశం అభివృద్ధి చెందుతోందని, రాబోయే రోజుల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. స్థానిక ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యుడు లక్ష్మణ్, నాయకులు నర్సింహ, తల్లోజు శ్రీను, దుర్గయ్య, కృష్ణయ్య, రవి, యాదయ్య, రాజు, జనిగల గిరి, జగన్, యాదగిరి, రమేశ్, నర్సింహ, శ్రీదర్, మధు, జగన్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధి సాకిబండతండాలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. నాయకులు విక్రంరెడ్డి, లక్ష్మణ్, రవిరాథోడ్, బాలునాయక్, నరేందర్‌రాథోడ్, జానయ్య, మణిపాల్‌నాయక్, నరేశ్‌నాయక్, దేవేందర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వంశీకృష్ణకు పరామర్శ



వంశీకృష్ణతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఆమనగల్లు: అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణను సోమవారం పలువురు కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. వంశీకృష్ణ ఇటీవల గుండెకు శస్త్రచికిత్స చేయించుకుని నగంలోని ఆయన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో వంశీని.. పీసీసీ సభ్యుడు అయిల శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు జవహర్ లాల్ నాయక్‌లు పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

‘జై బాపు’ను జయప్రదం చేయండి

ఆమనగల్లు: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టనున్న ‘జై బాపు, జై భారత్, జై సంవిధాన్ అభియాన్’ను జయప్రదం చేయాలని రాష్ట్ర పర్యాటక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావ్ సూచించారు. నగరంలోని ఆయన నివాసంలో సోమవారం కార్యక్రమ నిర్వహణపై కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, నియోజకవర్గ నాయకులతో మంత్రి జూపల్లి, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవిలు సమీక్ష నిర్వహించారు. త్వరలో జరపనున్న పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో కార్యక్రమంపై చర్చిస్తామని జూపల్లి పేర్కొన్నారు. అనంతరం మంత్రి జూపల్లిని ఎమ్మెల్యే కసిరెడ్డి సన్మానించారు. సమావేశంలో రాష్ట్ర సాంస్కృతిక మండలి చైర్‌పర్సన్ గద్దర్ వెన్నెల, పీసీబీ సభ్యుడు బాలాజీసింగ్, పీసీసీ సభ్యుడు అయిల శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాగర్‌కర్నూల్ పార్లమెంటు ఇన్‌చార్జి మధుసూదన్‌రెడ్డి, ఆమనగల్లు మార్కెట్ మాజీ చైర్మన్ బట్టు కిషన్‌రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్‌కుమార్ రెడ్డి, యాట నర్సింహ, నాయకులు ప్రభాకర్‌రావ్, భూపతిరెడ్డి, జవహర్‌లాల్‌నాయక్ పాల్గొన్నారు.



మంత్రి జూపల్లిని సన్మానించిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తదితరులు

వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా నిరసన



పోలీస్ బందోబస్తు మధ్య కొనసాగుతున్న నిరసన ర్యాలీ

పహాడీషరీఫ్: వక్ఫ్‌బోర్డు బిల్లు సవరణకు లోక్‌సభ, రాజ్యసభలలో ఆమోదానికి వ్యతిరేకంగా జల్‌పల్లి మున్సిపాలిటీలోని మైనార్టీ నాయకులు సోమవారం శాంతియుత నిరసన ర్యాలీని చేపట్టారు. షాహిన్‌నగర్ నుంచి ఎర్రకుంట చౌరస్తా వరకు కొనసాగిన ఈ ర్యాలీలో ముస్లింలు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. బిల్లును వెంటనే వెనక్కి తీసుకోకపోతే ఏప్రిల్ 13న ట్యాంక్‌బండ్ వద్ద భారీ నిరసన కార్యక్రమాన్ని చేపడుతామని హెచ్చరించారు. ర్యాలీ సందర్భంగా మహేశ్వరం ఏసీపీ లక్ష్మీకాంతారెడ్డి, బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ ఎం.సుధాకర్ బందోబస్తును ఏర్పాటు చేశారు.

డీఎస్పీ యాత్ర కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న డీఎస్పీ నేతలు

ఇబ్రహీంపట్నం: ధర్మ సమాజ్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహరాజ్ చేపట్టనున్న లక్ష కిలో మీటర్ల రథయాత్ర కరపత్రాలను ఆ పార్టీ నేతలు సోమవారం ఇబ్రహీంపట్నంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీల రాజ్యస్థాపనకు, ప్రజా సమస్యల పరిష్కారం కోసం యాత్ర చేపడుతున్నామని పేర్కొన్నారు. యాత్ర ఈ నెల 14న ఆదిలాబాద్ జిల్లాలో ప్రారంభమై.. 11 జూలై 2028లో హైదరాబాద్‌లో(3 సంవత్సరాల, 3 నెలలు) ముగుస్తుందని తెలిపారు. యాత్రను జయప్రదం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తులసిగారి రవీందర్, నాగార్జున, శేఖర్, ప్రదీప్, ఆనంద్, రాజు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రోజు విడిచి రోజు నీటి సరఫరా చేయాలని వినతి

మీర్‌పేట: రోజు విడిచి రోజు తాగునీటిని సరఫరా చేయాలని కోరుతూ మీర్‌పేట కార్పొరేషన్ 26వ డివిజన్ మాజీ కార్పొరేటర్ పెండ్యాల నర్సింహ సోమవారం జలమండలి జనరల్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. మీర్‌పేటలోని 26, 6 డివిజన్‌లలోని కాలనీల్లో మూడు, నాలుగు రోజులకోసారి తాగునీరు సరఫరా అవుతోందని, దీంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా వేసవి కావడంతో ప్రైవేట్ ట్యాంకర్లను ఆశ్రయించాల్సి వస్తోందని జీఎం దృష్టికి తీసుకెళ్లారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని, రోజు విడిచి రోజు నీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందులో నర్సింహతో పాటు నాయకుడు ప్రవీణ్ ఉన్నారు.



జీఎంకు వినతిపత్రం అందజేస్తున్న మాజీ కార్పొరేటర్ నర్సింహ, ప్రవీణ్

మత విద్వేషాలకు కేరాఫ్ బీజేపీ

మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణనాయక్

కందుకూరు: దేశంలో మత విద్వేషాలకు బీజేపీ ప్రభుత్వం పునాది వేస్తోందని మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.కృష్ణనాయక్, జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ ఏనుగు జంగారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బొక్క జంగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల ఇన్‌చార్జి పెంటారెడ్డి విమర్శించారు. సోమవారం పార్టీ ఆధ్వర్యంలో మండల పరిధిలోని గుమ్మడవెల్లి, మాదాపూర్ గ్రామాల్లో జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దేశంలో అడుగడుగునా అవహేళన చేసేలా మోదీ ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఆరోపించారు. కేంద్ర మంత్రి అమిత్‌షా అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సొడప్ప వెంకటేశ్‌గౌడ్, సీనియర్ నాయకులు అందుగుల సత్యనారాయణ, ఎండీ అఫ్జల్‌బేగ్, సరికొండ జగన్, ఢిల్లీ శ్రీదర్‌ముదిరాజ్, సయ్యద్ అజీజ్, ఎండీ సులేమాన్, మంద సాయిలు, దంతోజు నర్సింహాచారి, డైరెక్టర్లు కె.విష్ణువర్ధన్‌రెడ్డి, ఏ.సురేందర్, నాయకులు పి.శ్రీనివాస్, మహేందర్, శ్రీకాంత్, వి.బాబు, బి.పాండురంగారెడ్డి, కుమార్, శేఖర్, యాదగిరి పాల్గొన్నారు.



గుమ్మడవెల్లిలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ముగిసిన బ్రహ్మోత్సవాలు

కడ్తాల్: మండల పరిధి మైసిగండి రామాలయం శ్రీ కోదండరామచంద్ర స్వామి బ్రహ్మోత్సవాలు ముగిశాయి. శ్రీ రామనవమిని పురస్కరించుకుని మూడు రోజులుగా స్వామి వారి ఉత్సవాలు కనుల పండువగా జరిగాయి. ముగింపు రోజు సోమవారం స్వామి వారికి ప్రత్యేక పూజలు, చక్రతీర్థం, పుష్కరస్నానం, పూర్ణాహుతి, పల్లకీసేవ, తీర్థప్రసాదముల వినియోగంతో వేడుకలు ముగిశాయి. ఆలయ అర్చకులు భానుప్రకాశ్‌శర్మ, నాగేంద్రశర్మ, అమూల్యపతిల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ స్నేహలత, ఫౌండర్ ట్రస్టీ శిరోలీ, తహసీల్దార్ జ్యోతి, నిర్వాహకులు రామవత్ భాస్కర్‌నాయక్, అరుణ్‌కుమార్, యాదగిరిస్వామి, చంద్రయ్య, కృష్ణ, అర్చక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మైసిగండిలో పూర్ణాహుతి నిర్వహిస్తున్న వేద పండితులు

‘ఉపాధి’ బిల్లులు మంజూరు చేయండి



నిరసన తెలుపుతున్న కార్మికులు, సీఐటీయూ నాయకులు

తలకొండపల్లి: ఉపాధిహామీ బిల్లులు తక్షణమే మంజూరు చేయాలని సీఐటీయూ ఆమనగల్లు ఏరియా కన్వీనర్ పెంటయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 8 వారాలుగా ఉపాధిహామీ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. మండల పరిధి పడకల్ గ్రామంలో సోమవారం ఉపాధి కూలీలతో నిరసన వ్యక్తంచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చేసిన పనికి కూలి డబ్బులు రాక కూలీలు ఇబ్బంది పడుతున్నారని, వెంటనే మంజూరు చేయాలని కోరారు. లేనిపక్షంలో కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు జంగయ్య, పుష్పలత, చెన్నయ్య, శ్రీశైలం, రమేష్, కృష్ణయ్య, అలివేలు తదితరులు పాల్గొన్నారు.

‘రాజీవ్ యువ వికాసం’తో హడావిడి

- గిరిజన యువతను మోసం చేస్తున్న ప్రభుత్వం
- ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దశరథ్‌నాయక్

కడ్తాల్: గిరిజనులకు రావాల్సిన పెండింగ్ బకాయిలు చెల్లించకుండా, రాష్ట్ర ప్రభుత్వం ‘రాజీవ్ యువ వికాసం’ పేరుతో హడావిడి చేస్తుందని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దశరథ్‌నాయక్ ఆరోపించారు. ట్రైకార్ సబ్సిడీ రుణాలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ.. గిరిజన సంఘాలు సోమవారం ‘చలో గిరిజన భవన్’కు పిలుపునిచ్చాయి. ఈ నేపథ్యంలో దశరథ్‌ను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. స్టేషన్‌కు తరలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం 2019- 21 సంవత్సరానికి ట్రైకార్ సంస్థ ద్వారా గిరిజన యువతీ యువకుల నుంచి దరఖాస్తులు స్వీకరించిందని తెలిపారు. అనంతరం 30 వేల మందిని లబ్ధిదారులుగా గుర్తించిందని పేర్కొన్నారు. వారి ఖాతాలో జమ చేయడానికి నాటి ప్రభుత్వం రూ.219 కోట్ల చెక్కును ఆర్థిక శాఖకు పంపించిందని వివరించారు. కాంగ్రెస్ పార్టీ.. అధికారంలోకి వచ్చిన వెంటనే పెండింగ్ బిల్లులు ఇస్తామని చెప్పడంతో గిరిజన యువత సంతోషించారని పేర్కొన్నారు. తీరా చూస్తే ‘రాజీవ్ యువ వికాసం’ పేరుతో యువకులను ప్రస్తుత ప్రభుత్వం మోసం చేస్తుందని విమర్శించారు.



పోలీసుల అదుపులో దశరథ్‌నాయక్

కేంద్రం రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తోంది

టీపీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి

మహేశ్వరం: దేశాన్ని పాలిస్తున్న బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగం, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోందని పీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లి, పులిమక్త(హబీబుల్‌గూడ), గొల్లూరు గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ పాదయాత్ర నిర్వహించి, బీజేపీ ప్రభుత్వం చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేసి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం గత పదేళ్ల నుంచి ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని అవహేళన చేస్తుందని ఆరోపించారు. రాజ్యాంగ విలువలను కాలగర్భంలో కలిపేందుకు బీజేపీ ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుందని విమర్శించారు. పార్లమెంట్ వేదికగా కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రాజ్యంగ నిర్మాత బీఆర్.అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలను అభ్యంతరం వ్యక్తం చేస్తున్నామన్నారు. రాజ్యంగ విలువలు, ప్రజాస్వామ్యాన్ని కాపాడే బాధ్యత కాంగ్రెస్ పార్టీ తీసుకుంటుందన్నారు. కాంగ్రెస్‌తోనే దేశంలో దళితులు, గిరిజనులు, బీసీలు, మైనార్టీలకు న్యాయం జరుగుతుందన్నారు. అంతకుముందు జైసంవిధాన్‌పై కరపత్రాలు పంపిణీ చేశారు. జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర ఎస్సీసెల్ కన్వీనర్ నర్సింహ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చాకలి యాదయ్య, పార్టీ మహేశ్వరం నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు సమత, ఐఎన్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు నడికూడ శివ, సీనియర్ నాయకులు కాకి ఈశ్వర్‌ముదిరాజ్, అవుల యాదయ్య, కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు పెండ్యాల బాల్‌రాజ్, గొల్లూరు మాజీ సర్పంచ్ హరినాథ్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భాస్కర్‌రెడ్డి, నాయకులు